# ఇరుకు

7

తమ జీవితం కూడా ఒక చర్చనీయాంశం కాగలదని వెంకట్రామయ్యగానీ, అనసూయ కానీ ఎప్పుడూ అనుకోలేదు. తమ భావిజీవితం ఒక సమస్య అవుతుందని అనుకునే టైం వాళ్ళకి లేకపోయింది. ఈ వేసవి కాలం నలభైమూడు డిగ్రీల ఉష్ణోగ్రతలో, హఠాత్తుగా ఢిల్లీ నుంచి ఊడిపడిన తమ కొడుకు చెప్పేవరకూ తనకి అరవై మూడేళ్ళొచ్చాయని, తను 'వృద్ధుణ్ణి' అవుతున్నా నని రాబోయే కాలంలో తనకి యింకొకరు సేవ చెయ్యాలని, అలా చెయ్యాలంటే తానిప్పుడు, ఆ చెయ్యబోయే వాళ్ళకి సేవ చెయ్యాలని తెలుసుకోలేకపోయాడు.

ఈ ఇల్లు, ఈ ఊరూ, తన శ్రమ శాశ్వతమనుకుంటూ వచ్చాడు. అనసూయ మాత్రం?! ఉదయం అయిదుగంటలకి నిద్రలేచి గొడ్ల దగ్గర బాగుచేసి, పాలు తీసి కేంద్రానికి పంపించే దగ్గర మొదలుపెట్టి, రాత్రి పదింటికి నడుం వాల్చేవరకూ ఏదో ఒక పని చేసే అనసూయ కూడా తనకి అరవైయ్యేళ్ళొచ్చాయని,

అరవై ఏళ్ళంటే 'ముసలితనం' అని అనుకోలేదు కొడుకు చెప్పేవరకూ. వాడొచ్చాడు. వెళ్ళాడు. ఒక భయంకరమైన సత్యాన్ని వెల్లడించి. మొన్నటివరకూ రాజమ్మమ్మ బ్రతికి ఉంది. తొంభయ్యేళ్ళ రాజమ్మామ్మ అరవై అయిదేళ్ళనాడు ఈ ఇంట్లో కాలు పెట్టింది. భర్తను పోగొట్టుకుని వచ్చిన తోబుట్టువుని ఆదరంగా ఆహ్వానించాడు తన తండ్రి. ఆమె తమ్ముడైన తన తండ్రికి, అతని భార్యకి, పిల్లలకి ఎంతో చేసింది ఆవిడ. మరదలికి పురుళ్ళు పోసింది ఆ బిడ్డల ముడ్డు కడిగింది. ఆవిడ కళ్ళ ఎదటే ఆవిడ తమ్ముడు, మరదలూ పోతే 'నన్నెవరు చూస్తారని?' ఆవిడ బెంగపళ్ళేదు. 'ఈ ముసిల్ది నా పాలపడింది' అని అనసూయ అనుకోలేదు. ఆ మాటకొస్తే తన తండ్రికి, తల్లికి తమ వృద్ధాప్యం ఎట్లా గడుస్తుందనే ఆలోచన ఎన్నడూ రాలేదు. అటువంటి అభద్రతాభావం, భయం వాళ్ళకి లేదు. అంతా సహజంగా జరిగిపోతుందని నమ్మి వుండొచ్చు. ఇప్పుడటువంటి భయాన్ని, అభద్రతా భావాన్ని తమ కొడుకు తమకి కలిగించి వెళ్ళాడు. తన ఇల్లు బాగా పాతదైపోయింది. డెభ్భై ఏళ్ళనాడు తన తండ్రి కట్టించిన ఇల్లు. దూలం ఒకటి క్రిందికి జారింది. కడ్డీలు పుచ్చి పోతున్నాయి. వాడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంచి ఉద్యోగమే. ఇప్పటిదాకా ఎన్నడు వాడిని తను డబ్బు అడగలేదు. కూతురు ఇందిరకి కూడా బాగానే చదువు చెప్పించాడు. ఉద్యోగం చేస్తానని పట్టుబడితే బ్యాంకు పరీక్షలకి కోచింగ్‌కి కూడా ఖర్చుపెట్టాడు. తరువాత ఆమె పెళ్ళికి కాస్త ఎక్కువగానే కట్నం యివ్వాల్సి వచ్చింది. ఆమె చదువుకీ, ఉద్యోగానికి తగ్గవాడినే తేవల్సి వచ్చింది. పొలం తాకట్టుపెట్టి భారీగా అప్పు తెచ్చాడు. కొడుకు పెళ్ళికి వచ్చే కట్నంతో పొలం విడిపించుకోవాలని! కొడుకేమో తనతోపాటు ఉద్యోగం చేసే ఉత్తర హిందూస్థానం అమ్మాయిని చేసుకుంటానని పట్టుపట్టుక్కూర్చున్నాడు.

"పోన్లెండి. వాడి పెళ్ళి వాడిష్టం" అంది ముందు అనసూయే. తమ ఇళ్ళల్లో ఆడవాళ్ళు మరొకరైతే ఇల్లు పీకి పందిరేసి వుందురు. అనసూయ పద్ధతే వేరు మొదటినుంచీ. తనూ కరిగిపోయాడు. పొలం కొద్దిగా అమ్మేసి బాకీలు తీర్చాడు.

"వాణ్ణి మనం ఎప్పుడూ ఏమీ అడగలేదు గదా! ఇల్లు బాగు చేయించుకుంటాం కొద్దిగా డబ్బు సర్దమని అడుగుదాం" అంది అనసూయ.

"నాకు ఎంత కొడుకైనా అడగటానికి మొహమాటంగా వుంటుంది. నువ్వు ఉత్తరం రాయి" అన్నాడు వెంకట్రామయ్యా.

అనసూయ వ్రాసింది. కొడుకు దగ్గర్నుంచీ సమాధానం రాలేదు గానీ అతని స్నేహితుడి పెళ్ళికి వస్తున్నట్లు తెలిసింది. స్నేహితుడి పెళ్ళికి బెజవాడ వచ్చి ఇటు వచ్చాడు. కోడలు కూడా వచ్చింది.

ఇద్దరూ ముక్త కంఠంతో ఇలా అన్నారు. "ఈ ఇల్లు పడగొట్టి ఇక్కడ ఇల్లు కట్టడం ఫూలిష్ ఐడియా. అయినా ముసలివాళ్ళయ్యారు కదా? ఇక్కడెందుకు మీరు. ఆ రెండెకెరాల

పొలం పట్టుకుని నువ్వూ, ఈ గేదెలతో ఈవిడా ఎన్నాళ్ళు కష్టపడతారు? అన్నీ అమ్మేసి హాయిగా ఢిల్లీ వచ్చెయ్యండి. అక్కడ ఫ్లాట్ కొంటున్నాను. కాస్త పెద్దది కొందాం. మీకేదైనా అయితే ఎవరు చూస్తారిక్కడ?"

"ఇద్దరూ చిన్నపిల్లలైపోయారు. వాళ్ళని చూసుకని ఆఫీస్‌కి వెళ్ళడం చాలా కష్టంగా వుంది. నాకు మీరుంటే సాయంగా వుంటుంది" అంది కోడలు. మొత్తానికి ఇల్లు బాగు చేయించుకోవడానికి 'డబ్బులివ్వం' అని చెప్పటమే కాకుండా మరిన్ని సత్యాలు కూడా చెప్పి పోయారు.

వాళ్ళు వెళ్ళాక వాతావరణంలో వేడి నలభైమూడు డిగ్రీలున్నా యాభై డిగ్రీలున్నట్టు అనిపించింది. ఒకటే పొగలు, సెగలు. ఉబ్బరింత. వున్నచోట వుండనియ్యని ఉక్కపోత.

రాత్రి ఏడుగంటల వేళ టీ.విలో వార్తలు చూస్తూ కూర్చున్న వెంకట్రామయ్యా, ఆ ప్రక్కనే కూర్చుని గోంగూర కాడలు ఏరుతున్న అనసూయా కూడా అన్యమనస్కంగానే వున్నారు. తల ఎత్తితే 'నెత్తిన పడతాను' అంటూ భయపెడుతున్న దూలం! వార్తలమ్మాయి చదువుతోంది. అణుపరీక్షల గురించి, అమెరికా అలకల గురించి, జయలలిత బెదిరింపుల గురించి, జన్మభూమి ముచ్చట గురించి, అంతులేని వాగ్దానాల గురించి, ఎన్‌కౌంటర్ మరణాల గురించి, మందుపాతర్ల గురించి, దోపిడీల గురించి. ఆఖరికి వేడి గురించి.

"నేనట్టా బయటికి వెళ్ళొస్తా. ఊళ్ళో కొట్లాటయింది గదా! ఎట్లావుందో ఏమో!" అని తువ్వాలు దులిపి భుజాన వేసుకుని చెప్పులు తగిలించుకుని బయటపడ్డాడు వెంకట్రామయ్య "ఇంట్లో యిట్టా వుంది. బయటెట్టా వుందో" అనుకుంటూ. ఏ రకమైన గాలీ లేదు. అంతా బిగదీసుకున్నట్టు వుంది. ఒక్క ఆకు కదలడం లేదు. బస్సులాగే చోట మాత్రం జనం కనబడుతున్నారు. పెద్దరోడ్డు ముందు కూరగాయల కుప్పలవాళ్ళు కూర్చున్నారు. కూరగాయలు ఎండిపోయినట్టుంటే నీళ్ళు చల్లుతున్నారు. రథం దగ్గర హనుమయ్యగారి మనవరాలి పెళ్ళికి తెనాలి నుంచీ వచ్చిన బ్యాండ్ మేళం వాళ్ళు బస్సుదిగి అటుకేసి పోతున్నారు. లైబ్రరీ ముందు ఎత్తైన అరుగుల మీద బాపయ్యా, కృష్ణమూర్తీ, సుబ్బారావు కూర్చుని వున్నారు. అరుగులు కాలుతున్నా సరే. తనూ తువ్వాలు పరుచుకుని కూర్చున్నాడు వెంకట్రామయ్య.

"ఏంది? అబ్బాయి ఇల్లు కట్టుకుంటానికి డబ్బిచ్చిపొయ్యినాడా? పిల్లలు శానా బావున్నారు వెంకట్రామయ్యా" అన్నాడు కృష్ణమూర్తి.

వెంకట్రామయ్య మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నాడు.

"నీకేం ఒడ్డున పడ్డావు. బంగార్లాంటి కొడుకు, బంగార్లాంటి కూతురు. ఎక్కడున్నా ఎళ్ళిపోతుంది" అన్నాడు మళ్ళీ అతనే.

"నీకు మాత్రం ఏవయింది?" అన్నాడు వెంకట్రామయ్య.

కథా నిలయం
5366
శ్రీకాకుళం

"మా ఇంట్లో జరిగే జాతర నీకేం తెలుసు. రెండురోజుల కాణ్ణుంచి తిండి తింటంలే చిన్నాడు"

"ఏవొచ్చిందీ?"

"అదేదో 'మేయిన్ ప్రేము'లట అయ్యి జదివించి వీసా లిప్పించి అమెరికా పంపుతా వన్నాట్ట బెజవాడలో ఎవడో మూడు లక్షలు తెచ్చుకోమన్నాట్ట. రెండెకరాల పొలం అమ్మి డబ్బియ్యమని కూచున్నాడు. ఎంత చెప్పినా యిని చావడు"

"అక్కడ ఉద్యోగం ఖాయమేనా?"

"ఏం ఖాయమో ఏమో. కొంతకాలం 'ఆడ్ జాబ్'లంట అయ్యేంటో, అయ్యి జేస్తే తరువాత వస్తదంట ఉద్యోగం! మొత్తానికి అన్నీ గలిసి నాలుగు కావాలంట. హఠం పట్టి క్కూర్చున్నాడు"

"ఆడ్ జాబ్స్ అంటే చిల్లర పన్లయ్యా. పెట్రోలు బంకుల్లో, డిపార్ట్‌మెంటు స్టోర్సుల్లో. కానీ వీడిప్పించే 'హెచ్‌వన్' మీద పోయి 'ఆడ్ జాబ్స్ ఎట్లా జేస్తాడు? అది ఇల్లీగల్" అన్నాడు సుబ్బారావు. హైస్కూల్లో టీచరు చేసి రిటైరయ్యాడు. పేపర్లన్నీ చదువుతాడు. అతని తోడల్లుడి సంతానం అంతా స్టేట్స్‌లోనే.

"ఏమి ఇల్లీగలో ఏం పాడో. నా చావుకొచ్చిందనుకో సుబ్బారావ్. ఇది జూసి నా పెద్ద కోడలు కాళికమ్మవారైపోయింది. ఆస్తి పంచినాకే పొలం అమ్మాలంట. వాడొంతు అమ్ముకో మను అని కూచుంది. ఇంట్లో మంటలు" అని

"అమెరికా ఎల్లినాక నాకు పొలమెందుకు. అట్టాగే పంచు. నా వాటా నాకిచ్చెయ్ అన్నాడు. ఇంకేవన్నాడో తెలుసా. నన్ను అమెరికా ఎల్లనియ్. పిల్లల్నిస్తామని 'క్యూ'లో నుంచుం టారు జనం. కావాల్సినంత కట్నం తీసుకో. నువ్వు వుంచుకో నాకొద్దు అన్నాడు."

"ఆహా! తెలివి కలాడే!" అన్నాడు బాపయ్య.

"ఏం తెలివో? ఏం పాడో. చంపుకుతినేస్తున్నాడు. ఇప్పటికప్పుడు అమ్మాలంటే అదే మైనా బంగారం గొలుసా? వెండికంచమా చెప్పు. బేరంపెట్టాలి. ఎవరైనా కొనేవాళ్ళుండాలి."

"నా మనవరాలికి పెళ్ళి ఖాయమయేట్టుంది. వాళ్ళకి 'క్యాష్' కావాలంట. నేనూ అమ్మాల్సిందే ఒకటో రెండో" అన్నాడు బాపయ్య.

"అందరికీ యాపారాల పిచ్చీ, యిదేశాల పిచ్చీ పట్టింది. వున్న ఊరే కాదు దేశం కూడా పనికిరాకుండా పోయింది" అన్నాడు బాపయ్య మళ్ళీ.

"ఏ పిచ్చి పడితే అదేననుకో! ఒకటో క్లాసు, రెండో క్లాసు చదువులకి కూడా మనూరు పనికిరాటంలా. గుంటూరు బెజవాడా తోలేస్తున్నారు పిల్లల్ని. ఎలిమెంటరీ స్కూల్ చదువులకే

వేలకి వేలు. పులిన్జూసి నక్క వాత పెట్టుకున్నట్టు కాస్త డబ్బుండాళ్ళని జూసి మనబోటోళ్ళు కూడా వాతలు బెట్టుకుంటున్నారు" అన్నాడు సుబ్బారావు.

'ఎనిమిదౌతోంది. మరి నేనింటికి బోవాల. ఎనిమిదిన్నరకల్లా అన్నం తినకపోతే మా కోడలు భద్రకాళైపోతుంది మళ్ళీ. ఆవిడ ఎనిమిదిన్నరకల్లా సీరియల్ జూడ్డానికి టీ.వి ముందుండాల. ఎనిమిదిన్నర్నించీ పన్నెండు దాకా అక్కడ నుంచీ కదలదు. ప్రొద్దుగాల ఏడింటికి లేవటం, పాలు తియ్యటం నేనూ, కల్లాపి జల్లడం నా మనవరాలూ" అని లేచాడు బాపయ్య.

అతని భార్య పోయి రెండేళ్ళయింది.

అంతలోనే తెనాలి నుంచి వచ్చే సిటీబస్సు వచ్చింది. అందులో నుంచి ఓ పదిమంది యువకులు దిగారు. వాళ్ళంతా ఊళ్ళో హైస్కూల్లో టెన్త్ నాలుగుసార్లు తప్పి చదువు మానేసిన బాపతు. తండ్రికి పొలంలో సాయం చేయకపోగా ఇంటి దగ్గర తల్లి మీద అజమాయిషీ చేస్తూ వుంటారు. పగలంతా బస్సులాగే చోట కిల్లీబడ్డీ దగ్గర నిలబడి ఊళ్ళో హైస్కూలుకీ, తెనాలి కాలేజికి వెళ్ళే అమ్మాయిల్ని ఏడిపిస్తుంటారు. ఖరీదైన స్కూళ్ళల్లో ఖరీదైన పునాదులు వెయ్యలేకపోయిన తల్లితండ్రులకి ఈ పిల్లలు ప్రశ్నార్థకాలుగా తయారయ్యారు. వాళ్ళని చూసి ఓ నిట్టూర్పు విడిచాడు సుబ్బారావు. మొన్న జరిగిన గొడవలో వీళ్ళే పనిముట్లు. బహుశా అతనికి తను పనిచేసినప్పటి పిల్లలు గుర్తు వచ్చి వుంటారు. అప్పట్లో పదో క్లాసులో జిల్లా కంతా ఫస్ట్ వచ్చిన పిల్లలు వుండేవాళ్ళు. ఇప్పుడు ఎంత పడిపోయింది ఈ స్కూలు. చాలామంది టీచర్లకి ఇంటి దగ్గర ట్యూషన్లు. ట్యూషన్లకి వెళ్ళని వాళ్ళకి క్లాసులో వేధింపులు. టెన్త్ క్లాసులో కాపీలు కొట్టడాలు, డిబార్లు.

గంగరావి చెట్టు ఆకులు కదులుతున్నాయి. చల్లగాలి తిరిగింది. కృష్ణమూర్తి అంటున్నాడు.

"ఆడేమో తన వాటా అమ్మి అమెరికా పంపియ్యమంటాడు. ఇక పెద్ద కోడలేమో తమ వాటా అమ్మేసి డబ్బిమ్మంటుంది. పిల్లల్ని గుంటూర్లో చదివిస్తదంట. మొగుడితో యాపారం పెట్టిస్తుందంట తోడల్లుడితోపాటు. మరిక నా సంగతేంటి ఎంకట్రామయ్యా? నేనెక్కడుండాలి? నీకైతే పెళ్ళాం వుంది. నాకు లేదు? ఎవరు తిండి పెడతారు నాకు?"

"ఆస్తి మూడువాటాలేసి నీది నువ్వుంచుకో. అది బెట్టుకుని ఇక్కడ వుండు. ఎవరమో వొకళ్ళం చూసుకుంటాంలే నిన్ను బెంగపడకు"

"అట్టకాదంటా ఇల్లు కూడా అమ్మేసి ఆళ్ళెంట గుంటూరు పోవాల్నంట"

"అది అయ్యే పనికాదులే. అట్లా చెయ్యమాక ఇబ్బంది పడిపోతావు. మరి నేనొస్తా. అనసూయ తొందరగా రమ్మంది" అని గబగబా అడుగులేసుకుంటు ఇంటికొచ్చేసరికి,

పున్నయ్యగారి సీతారాముడు కూర్చుని వున్నాడు. ఊరికే రాడు. కూతురికి సంబంధం ఖాయం అయింది. బేరసారాల్లో అనసూయ సహాయం కావాలి. వాళ్ళు అనసూయకి దగ్గర బంధువులు.

"అబ్బాయిని గుంటూరు రెసిడెన్షియల్‌లో పెట్టాను బాబాయ్! యాడాదికి ముప్పై యేలు తప్పదుగదా! వున్నది ఆడొక్కడు బాగా సదివించాలి గదా! ఇంటర్‌కి లక్ష అవుతా వుంది. ఆపైన ఇంకెంతో చూడు. అందుకని కాస్త కట్నం దగ్గర పిన్నిని 'రికమెండ్' చెయ్యమని అడగడానికొచ్చా" అన్నాడు.

"ఇంటర్‌కి లక్షెంటబ్బాయ్. సోద్యం!' అంది అనసూయ.

"ఇప్పుడంతే పిన్నీ. అట్టా చదివితేగానీ ఎంసెట్టు రాదు. అందాక ఎందుకు, గుంటూర్లో పెట్టి చదివించినాకే గదా టెన్త్ ప్యాసయినాడు. 'మనాళ్ళ'కి ఎంత పెద్ద ర్యాంకు వచ్చినా సీట్లు రావుగదా! ఇప్పుడన్నీ ఖరీదే పిన్నీ" అన్నాడు సీతారాముడు.

"అదివరకు అట్ట లేదబ్బాయ్" అంది అనసూయ.

"ఇప్పుడన్నీ యింతే పిన్నీ" అని వెళ్ళిపోయాడు సీతరాముడు.

"తొందరగా నీళ్ళు పోసుకురండి. మళ్ళీ కరెంటుంటుందో పోతుందో కాస్త గాలి కొడితే చాలు" అంది అనసూయ.

బావి దగ్గర పది బక్కెట్లు నీళ్ళు తోడి పోసుకునేసరికి ప్రాణం వచ్చినట్టయింది.

"దాని అలక తీరి ఉత్తరం రాసిందిగా. మనకి ఇప్పుడు పన్లేం లేవు. ఓమాలి హైదరాబాదెళ్ళి పది రోజులుండొద్దాం" అంది కంచాలు పెడుతూ.

ఆయనేం అనకపోయేసరికి "ఏంటో ఇన్నేళ్ళొచ్చినయ్. హైదరాబాదంతా కూడా చూడలా. ఈసారి వారంరోజులుండి అన్నీ చూసి రావాలి" అంది.

"అక్కడ కూడా నలభై రెండంట."

"ఇక్కడ లేదా యేం. మన్నేంజేస్తయ్ ఎండలు?" అంది.

"సరే పద శనివారం రాత్రి నర్సాపూర్‌కి టికెట్లు తెప్పిస్తా గుంటూరెళ్ళి ఎక్కుదాం."

"శనివారం రాత్రికి ఎక్కి ఆదివారం పొద్దున దిగుతాం. ఆదివారమంతా మనం పట్టు కెళ్ళినయ్యి సద్దటం, కబుర్లు. సోమవారం చార్మినారు మసీదు, మంగళవారం గోల్కొండ, బుధవారం సాలార్‌జంగ్ మ్యూజియం, గురువారం నా స్నేహితురాలు శ్యామలాంబ ఇంటికి, శుక్రవారం ఇంకేదైనా, శనివారం కొనుక్కోటాలు, బిర్లామందిరం, ఆదివారం మళ్ళీ రైలెక్కటం. ఎట్లా వుంది?" అంది.

"అబ్బో బ్రెమ్మాండంగా వుంది ప్లాను. అట్టాగే కానియ్. ఈవ్యాళే అమ్మాయికి ఉత్తరం రాసేస్తా వస్తున్నామని"

"అయితే ప్రయాణానికింకా నాలుగురోజులే వుంది. ఈపూట బియ్యం నానబోసి రేపు అరిసెలు, చెక్కలు వండెయ్యాలి. పార్వతమ్మ సాయం వస్తుందిలే. ఎల్లుండి మినపసున్నీ,

కారప్పొడీ, అమ్మాయి గోరింటాకుపొడి, మందారపూల పొడీ, ఉసిరికాయపొడీ తెమ్మని అదివరకే చెప్పింది. ఎప్పుడో చేసిపెట్టా. ఎవరన్నా వస్తే పంపిద్దామని. సీతారాముడు చక్రకేళీల గెల పంపిస్తానన్నాడు. మనం వెళ్ళేది శనివారం గదా! శుక్రవారం బెజవాడెళ్ళి చిన్నరసాలు ఒక యాభై బుట్ట కట్టించి తెస్తే సరి" అనసూయ కంచంలో చెయ్యి పెట్టుకుని ఆపకుండా మాట్లాడేస్తోంది.

"మినుములమ్మిన డబ్బులున్నయ్‌గా. ఓ వెయ్యి నాకియ్యండి అక్కడేవైనా కొనుక్కోటానికి" అంది.

"నీ కూతురికి బ్యాంకులో ఉద్యోగం. నువ్వడిగినవన్నీ కొనిపెడుతుందిలే" అన్నాడు వెంకట్రామయ్య.

"ఏం కొనిపెడుతుందో దానిష్టం. నేనేం అడగను" అంది అనసూయ.

అపార్ట్‌మెంటు కొంటున్నప్పుడు పొలం తాకట్టు పెట్టి కొంచెం డబ్బు అప్పుగా యిమ్మని అడిగింది. తనవల్ల కాదన్నాడు. అలిగింది. గృహప్రవేశానికి వెళ్ళినప్పుడు కూడా ముభావంగా వుంది. ఇప్పుడు మళ్ళీ ఉత్తరం వ్రాసింది. ఇల్లు 'ఫినిషింగ్' అంతా అయిపోయిందనీ, చూసి పొమ్మనీ, నాలుగురోజులుండమనీ. అబ్బాయొచ్చెళ్ళాక మనసంతా గందరగోళంగా వుంది. కాస్త ఎటన్నా వెళ్ళి రావడమే బావుంటుంది.

* * *

"అబ్బో ఇల్లంతా సినిమా సెట్టింగులాగ జేశావమ్మా" అంది అనసూయ లోపల కాలు పెడుతూనే. రెండు పడక గదుల అపార్ట్‌మెంట్. పొడవాటి హాలులో సగం సోఫాలు, దివాను, పూలకుండీలు, క్రోటన్ మొక్కలు, టీపాయ్, టీవిలతో నిండిపోయింది. సోఫాల వెనకున్న పెద్ద కిటికీ మూసివేసి పువ్వుల కర్టెన్ వేశారు. హాలులో మరో సగంలో గుండ్రని డైనింగ్ టేబుల్ దాని మీద ప్లాస్టిక్ టేబుల్ క్లాత్. దాని మీద ఆరు కంచాల కోసం ఆరు ప్లాస్టిక్ మ్యాట్స్. మధ్యలో చిన్న పేముబుట్టలో అచ్చం సినిమాలోలాగానే పళ్ళు. అక్కడ మళ్ళీ పెద్ద కిటికీ, దానికి కర్టెన్. డైనింగ్ టేబుల్ మీద దీపాల గుత్తి. అక్కడ మళ్ళీ క్రోటన్ కుండీలు, మూడు 'సిట్ అవుట్స్' రెండింటి నిండా క్రోటన్ కుండీలు. ఒకటి అంట్లు తోముకోడానికి. ఇహ వంట ఇల్లు స్టీలు సామాన్ల షాపులా వుంది. తను తెచ్చిన డబ్బాలూ, బుట్టలూ వంట ఇంట్లో ఒకప్రక్కగా పెట్టి "మా పెట్టెలెక్కడ పెట్టుకోమన్నావు" అంది అనసూయ.

"పిల్లల గదిలో పెట్టుకోండి. అదే గెస్ట్‌రూం కూడా. త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొందామంటే చేత కాలేదు. ఇప్పటికే చాలా వడ్డీ మీద అప్పు చేశాం" అంది ఇందిర.

"గెస్ట్‌లేమిటే. మేం మీ మనుషులం కాదూ" అంది అనసూయ కాస్త నొచ్చుకుని.

"ఇక్కడ మేమూ, మా పిల్లలు తప్ప అందర్నీ గెస్ట్‌లే అంటారమ్మా" అంది ఇందిర.

ఆదివారం ఫ్లాట్స్‌లో నుంచీ మసాలా వాసనలు ఘుమ్మంటున్నాయి. ఇందిర కూడా చికెన్ తయారీలో వుంది. "నే చేస్తాలే. నువ్వు వేరే పని చూసుకో" అని వంటగదిలో చొరపడింది అనసూయ.

రాత్రి భోజనాలయాక "రేపటి నుంచీ సెలవు పెట్టావా ? రేపేం చూపిస్తావు నాకు?" అనడిగింది కూతుర్ని.

"ఏం చూస్తావమ్మా ఇక్కడ? ఇంత ఎండల్లో! అయినా సెలవు యివ్వరమ్మా ఇప్పుడు. మొన్నే ఎల్.టి.సి మీద పదిరోజులు బొంబాయి, గోవా తిరిగొచ్చాం. ఇప్పుడు సెలవు యివ్వరు. శనివారం నాడు హాఫ్‌డే కదా! మధ్యాహ్నం నుంచీ నిన్ను బిర్లా గుడికి తీసుకుపోతాలే. ఆదివారం దాకా వుంటారు కదా!" అంది.

"మీ అమ్మ ఈసారి పెద్ద ప్లాను మీదొచ్చింది. సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ, చార్మినారు, అన్నీ చూడాలంట" అన్నాడు వెంకట్రామయ్య.

"ఈ వయస్సులో ఇంకా ఏం చూస్తావమ్మా అవ్వన్నీ. ఈ ఎండలో తిరిగి పడక పెడతావు" అన్నది ఇందిర.

"చూడాల్సిన వయసులో కుటుంబ బాధ్యతల్లో కూరుకుపోయాం. చూడాలని కూడా తెలీలేదు మాకు"

"హాయిగా విశ్రాంతి తీసుకోండి. మీ అమ్మాయికి కాస్త సాయంగా వుండండి. పిల్లల్తో కాలక్షేపం చెయ్యండి" అన్నాడు శరత్‌బాబు.

"పిల్లలు మాత్రం ఇంట్లో వుంటారా ఏంది? వాళ్ళకేవో కోచింగులు పెట్టారుగా. సంగీతాలూ, డాన్సులు, బొమ్మలెయ్యటాలు, ఈదటాలు, ఆడటాలు."

"అవ్వన్నీ పెట్టకపోతే సెలవుల్లో ఇల్లు పీకి పందిరేస్తారమ్మా. ఏదో వంకపెట్టి బయటికి తోలాలి. తప్పదు"

"ఏమి సోద్యమో! సెలవుల్లో కూడా పిల్లలు హాయిగా వుండకుండా! మరి మాకేం తోస్తుందీ?"

"రేప్రొద్దున్న సగ్గుబియ్యం వడియాలు పెట్టు టెర్రస్ మీద, లిఫ్టులో వెళ్ళి. సరేనా?" అని ఇహ చెప్పటానికేంలేదన్నట్లు "నిద్రొస్తూంది. పడుకుంటామరి! మీకు పిల్లలగదిలో వేశాను పక్కలు, ఒరేయ్ అనుదీప్! నువ్వు సోపా మీద పడుకో, అనూష దివాన్ మీద సరేనా?" అంది.

వాళ్ళ పడకగదిలో కూలరుంది. పిల్లల గదిలో లేదు. రాత్రిపూటైనా కిటికీలు తెరవ్వచ్చో లేదో. దుమ్ము, ధూళీ, దోమలూ వస్తాయట కిటికీలు తెరిస్తే. ఎపుడూ మూసే వుంచాలట.

ఒక రాత్రివేళ అనుదీప్ నిద్రలో నడిచి వచ్చి తాతగారి కాళ్ళ మీద పడుకున్నాడు. ఆయన లేచి వెళ్ళి సోఫాలోకి మారాడు. ఇంకాసేపటికి టెడ్డీబేర్ పొట్ట మీదేసుకుని అనూష వచ్చి అమ్మమ్మ గుండె మీద తలపెట్టగా, ఆవిడ లేచి దివాన్ మీదకి చేరింది. ఆ పిల్లలిద్దరూ వాళ్ళకి అలవాటైన ప్రక్కల మీద చేరి హాయిగా నిద్రపోయారు.

ధైర్యం చేసి హాలు కిటికీలు తెరిచి చాలాసేపు నిద్రరాక దివాన్ మీద దొర్లింది అనసూయ. ఏదో సినిమాలో రావుగోపాలరావు చెప్పినట్లు 'దివాను' అంటే మంచానికి తక్కువ, బెంచీకి ఎక్కువ.

సోమవారం ప్రొద్దున్న టెర్రస్ మీద సగ్గుబియ్యం వడియాలు పెట్టి "తోచదని ఎందు కన్నానురా దేవుడా!" అని ఆక్రోశించింది. ఎండకి తలకాయ దిమ్మెక్కిపోయింది.

ఇక మంగళవారం ప్రొద్దున్న ఆఫీసుకి వెడుతూ "ఇవ్వాళ నా కాటన్ చీరెలు ఓ పది దాక వున్నాయ్, కాస్త పనమ్మాయిచేత గంజి పెట్టి టెర్రస్ మీద పట్టించి పెట్టమ్మా" అంది ఇందిర.

"మా అమ్మొచ్చింది. నిజంగా అమ్మ అమ్మే అనుకోండి. రాంగానే వంట యింట్లో కొచ్చిండి. అమ్ముండగానే ఇల్లు సర్దుకోవాలి" అంటోంది ప్రక్క అపార్ట్‌మెంటావిడతో. బుధవారం ఉదయం "వంటయింటి అలమార్లు దులిపిస్తావా!" అంటూంటే వెంకట్రామయ్య అడ్డు తగిలి, "ఇవ్వాళ మేం కాస్త బయట తిరిగొస్తాం. ఈ నాలుగురోజులూ ఆవిడకి ఊరు చూపించు కొస్తా" అన్నాడు.

"మీరేం తిరుగుతారు నాన్నా. ఆటోలవాళ్ళు మిమ్మల్ని బాగా మోసం చేస్తారు. వడదెబ్బ తగులుతుంది" అంది కూతురు.

"ఫరవాలేదులే. మాకు ఎండ అలవాటే" అన్నాడు. బయట కాలు పెట్టగానే అన సూయ మొహం కోటిసూర్యప్రభలాగా వెలిగిపోయింది. "ఇది మనదేశం. ఇక్కడ మాట్లాడేది తెలుగు. లండనూ కాదు, పారిస్సూ కాదు. మనకి చేతనైనట్టు మనమే తిరిగొద్దాం" అన్నాడు.

పొద్దున వండి సాయంత్రానికి కూడా వంట చేసిపెట్టి బయల్దేరేది అనసూయ. పాపం! సాయంత్రం ఇందిర బ్యాంక్ నుంచి వచ్చి కష్టపడకుండా.

ఇంట్లో నుంచి బయటికి రాగానే యవ్వనం తిరిగి వచ్చినట్టయింది.

"తడవకీ మనని 'ముసలివాళ్ళు' అంటారేమిటి?" అంది అనసూయ.

"పనులు చేసిపెట్టడానికి ముసలివాళ్ళం కాము. ఏదైనా కావాలనప్పుడే ముసలాళ్ళం అవుతాం. అదే తమాషా" అన్నాడు వెంకట్రామయ్య.

తిరిగి ఇంటికొచ్చేసరికి ఏడున్నరయింది.

"నువ్వు ముందు పద, నేనొక సిగరెట్ కాల్చుకొస్తా" అని ఆవిణ్ణి లిఫ్ట్ ఎక్కించాడు. మూడో అంతస్తులో లిఫ్ట్ దిగేసరికి తెరిచి ఉన్న తలుపు హాలులో టి.విలో సినిమా పాటలు వస్తున్నాయి. సోఫాలో కూర్చుని "అమ్మా! అనూషా కాసిని మంచినీళ్ళు తేరా" అని కేక పెట్టింది.

అనూ లోపల్నించి వచ్చి, మళ్ళీ లోపలికి పరిగెత్తి ఇందిర్ని వెంటబెట్టుకొచ్చింది.

ఆవిడ కాస్త కంగారుగా "ఎవరు కావాలండీ" అనడిగింది.

"అదేమిటీ, ఎవరు కావాలనటం ఏమిటీ, ఎవరంటావేమిటీ, నేను మీ అమ్మని" అంది అనసూయ ఇంకా ఎక్కువ కంగారుగా.

"ఎవరిల్లు కావాలండీ మీకు?" అంది ఇందిర.

"ఇందిర. ఇందిరవి కావా నువ్వు"

"ఓ ఇందిర అమ్మగారా! ఇది 'సీత్రీ' ఆంటీ! ఇందిరది 'సీఫోర్'."

అప్పుడు పరిశీలనగా చూస్తే ఇందిర కాదు. అదే నైటీ, అదే కత్తిరించిన జుత్తు. దానికి అట్టాంటిదే 'నల్ల గుడ్డపీలిక'. ఇంట్లో అవే సోఫాలు. అదే దీవాను. అవే క్రోటన్ కుండీలు, అదే కర్టెన్లు.

"పొరపాటుగా వచ్చానమ్మా! ఏం అనుకోకు. పాప పేరేమిటి?"

"అనూష అండీ."

"నా మనవరాలి పేరూ అదే"

"ఈ ఫ్లాట్స్‌లో పదిమంది అనూషలున్నారు"

ఆశ్చర్యపడుతూ ఇంటికొచ్చి చెప్పింది.

"ఇంకా నయం. ఒకరోజు కరెంట్ పోయింది. చచ్చినట్టు మెట్లెక్కి వస్తున్నా. నాకన్నా ముందు గబగబ మెట్లెక్కుతోంది. ఆకుపచ్చరంగు అద్దాలు కుట్టిన చుడీదార్, అదే బ్యాగు, అదే జుట్టు, అదే నడక. 'ఏయ్! నేనూ వస్తున్నా వుండు' అని భుజం మీద చెయ్యి వేశాను. వెనక్కి తిరిగింది. 'సీటూ'లో పద్మిని" అన్నాడు శరత్‌బాబు.

"చెంప పగలగొట్టిందా?"

"అబ్బే అట్టా ఏం లేదు. నవ్వి, 'సారీ! నేను ఇందిర్ని కాను, పద్మినినండీ' అంది. అప్పట్నించీ ఇందిర భుజం మీద కూడా చెయ్యి వేయట్లేదు"

"సోద్యం, అచ్చం ఇట్టా అందరూ ఒకేరకంగా వుంటం" అని చాలాసేపు ఆశ్చర్య పోయింది అనసూయ.

"శనివారం నాడు నువ్వు నాకు ముత్యాలు కొనిపెట్టు. పార్వతమ్మత్తయ్య తెమ్మంది. అట్టాగే పోచంపల్లి చీరె కూడా సుగుణమ్మ కూతురికి తేవాలి" అంది కాసేపాగి.

ఇంకొకరి పన్లు నెత్తిన వేసుకోడం ఎంత తప్పో చాలాసేపు పాఠం చెప్పింది ఇందిర.

"ఈవారం రోజులూ మనిల్లు చూసుకునేది పార్వతేనే! దానికామాత్రం చెయ్యపోతే ఎట్టా! నీచేత ఏరించి కొనిపించమని మరీమరీ చెప్పి డబ్బు కూడా యిచ్చింది. ఇక సుగుణమ్మ మాత్రం మనింటో మనిషిలాంటిది గాదూ"

"మీకు అంతా ఇంటో మనుషులేనమ్మా. ఇట్లా ఇక్కడెవరూ పన్లు నెత్తినేసుకోరు. అయినా కొందాంలే తప్పేదేముందీ. అది కొనుక్కొని అట్నించటే బిర్లామందిరం చూపించుకొస్తా. అమ్మాయి ఏమీ చూపించలేదని నిష్ఠూరం వేస్తావు మళ్లీ"

"నువ్వుండగానే కాస్త వంట యిల్లు దులిపించి పెడుదూ. నువ్వెళ్ళినాక నాకసలే తీరదు" అని గారాలు పోయింది. రాకరాక వచ్చిన తల్లికి 'పెద్దవాళ్ళకి బావుంటుంది' అని ఒక ముదురు రంగు చీరె పెట్టింది.

* * *

'ప్రపంచం ఎంత చిన్నదైపోయిందండి! ఏం కమ్యూనికేషన్ సిస్టం! ఏం ట్రాన్స్‌పోర్ట్ సిస్టం!" అని కళ్ళు పెద్దవి చేసి చేతులు తిప్పుతూ చెబుతూ, మధ్య బెర్త్ మీద దుప్పటి పరుచుకుంటున్నాడొక బట్టతలాయన.

"అవునవును, 'ఈమెయిల్' చూశారా! ఇంటర్నెట్ వుంది చూశారా! ఇవ్వన్నీ ఎంత ఎడ్వాన్స్‌మెంటూ! ఎంత?" అని అందుకున్నాడు పై బెర్త్ మీద అప్పటికే శయనించిన ఆయన మిత్రుడు.

లోయర్ బెర్త్ మీద పడుకున్న అనసూయకి సందేహం వచ్చింది. ఆమెకి సందేహాలు దాచిపెట్టుకునే అలవాటు లేదు. వెంటనే తన ఎదురుగా మరో లోయర్ బెర్త్ మీద పడుకున్న వెంకట్రామయ్యని అడిగేసింది.

"ప్రపంచం చిన్నదైందా! ఇరుకైందా?" అని. ఆయనేదో ఆలోచిస్తున్నాడు. కళ్ళు మూసు కుంటే విరిగిపడ్డానికి సిద్ధంగా వున్న దూలం కనిపిస్తున్నట్లుంది.

"ఏమిటీ తేడా!" అన్నాడు పరాకుగా.

"ఏమిటి తేడా అంటే నాకు చెప్పటం చేతకాదు. అయినా చెబుతా. ఇప్పుడు మని ల్లుంది. చిన్నదేగదా! వసారా, రెండు గదులూ, వంట సావిడీ, కాకపోతే వాకిలీ, దొడ్డీ వుందనుకో. అవ్వి గొడ్లకీ, చెట్లకీ సరిపోతాయ్. మరి ఆ ఇంట్లోనే ఎంతమందిమి వుండేవాళ్ళం? అత్తమ్మా, మామయ్య, రాజమ్మమ్మ, మనిద్దరం మన పిల్లలు, వచ్చేపోయే చుట్టాలు, మరి అమ్మాయింట్లో అన్ని సౌకర్యాలు వున్నాయ్. నీళ్ళు తోడుకోనక్కర్లేదు. కాగుల కింద మంటలు పెట్టక్కర్లేదు. అన్నీ వున్నా యిల్లు ఇరుకే. వాళ్ళకీ వాళ్ళ పిల్లలకీ తప్ప. కన్నవాళ్ళం మనకే చోటులేదు. ఎందుకంటా?" అంది.

"ఓష్ అదా. మనింట్లో మనుషులుండేవాళ్ళు. వాళ్ళింట్లో వస్తువులున్నాయ్, మనుషులు ఒకరి కోసం ఒకరం సర్దుకునేవాళ్ళం. వస్తువులకి ప్రాణం లేదుగదా! ఎక్కడ పెట్టినయి అక్కడే వుంటయ్"

"అదేందో ఆ కాయని, పుయ్యని క్రోటన్ మొక్కలు ఇంటినిండా. మొక్కలు ప్రాణ వాయువు విడుస్తయ్యని చెప్పింది. కిటికీలు మూసుకుని క్రోటన్ మొక్కలు విడిచే ప్రాణ వాయువు పీల్చటమేమిటీ! సోద్యం."

"ఎవరి పిచ్చివాళ్ళకానందం. పడుకో. పడుకో."

"అట్టాకాదండీ అసలెంతసేపటికీ వాళ్ళ సంగతి వాళ్ళకేగాని ఇంకోళ్ళ సంగతే తలవరు. ఇందిర శానా మారిపోయింది" అంది అనసూయ.

"ఇప్పుడంతా అంతే. చిన్నప్పుడు చదువుకోలా! భూమి తన చుట్టూ తను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుందనీ. అట్టా ఇప్పుడు మనుషులు వాళ్ళ చుట్టూ వాళ్ళు తిరుగుతూ డబ్బు చుట్టూ తిరుగుతున్నారు. 'ముందు ఎట్టాగో?' అని వాళ్ళ భయం. వీలున్నంత పోగేసుకోవాలి. అది వాళ్ళూ వాళ్ళ పిల్లలే అనుభవించాలి. ఈ భయం అన్ని ప్రేమల్ని మింగేసింది. మనకి తెలీవు ఇట్టాంటివి. పడుకో. కళ్ళు మూసి తెరిచేపాటికి గుంటూరొచ్చేస్తుంది."

అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ అసంతృప్తిగా కళ్ళు మూసుకుంది అనసూయ.

*సుప్రభాతం వీక్లీ, 2 ఆగస్ట్ 1998*